


# బహుమతి

-డా. ఎం. సుగుణరావు

ఉగాది
కథల పోటీలో
ఎంపికైన కథ

అదొక ఓపెన్ ఎయిర్ థియేటర్.

అంతా జన సందోహం. అందరూ హడావిడిగా తిరుగుతున్నారు. రాష్ట్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు జరుగుతున్నాయి. పోటీల్లోని పాత్రధారులు, వాళ్ళను నటింపజేసే సూత్రధారులు, ఇంకా ఆ పోటీలను తిలకించేందుకు వచ్చిన వాళ్ళు ఇలా వేలాది మందితో ఆ ఆడిటోరియం కిక్కిరిసిపోయి ఉంది.

ఆ ఆవరణలోకి ఒక బిచ్చగాడు ప్రవేశించాడు. మాసిన చిరుగుల చొక్కా, బవిరి గడ్డం, తైల సంస్కారం లేని జుట్టు, చేతిలో అల్యూమినియం గిన్నె, చంకలో అతుకులేసిన చొక్కా. 'బాబూ ధర్మం!' అంటూ అడుక్కుంటున్నాడు. వేసేవాళ్ళు వేస్తున్నారు. 'నీకు వేరే చోటు లేదా అడుక్కోవడానికి' అని కొంతమంది కోప్పడుతున్నారు. అయినా ఆ బిచ్చగాడు అడుక్కోవడం మానలేదు. ఆ ఆవరణ అంతా కలియతిరుగుతూ మెల్లగా స్టేజీ ఎక్కడానికి ప్రయత్నించాడు. కార్యకర్తలు బలంగా కిందకు తోసేశారు. అయినా మళ్ళీ ఎక్కడంతో ఈసారి కర్రతో కొట్టారు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా మూడోసారి ఎక్కాడు. ఈసారి మళ్ళీ కిందకు తొయ్యబోయారు. అంతే మైకులో ఎనౌన్స్‌మెంటు వినిపించింది.

'బిచ్చగాడు, ఏకపాత్రాభినయం - నటించేది ప్రకాశం'

అంతే, ప్రేక్షకులంతా ఆశ్చర్యంగా చూశారు. అతడిని స్టేజీ మీద నించి తోసేసిన నిర్వాహకులు ఒక్కక్షణం షాక్‌తో నిలబడిపోయారు.

బిచ్చగాడుగా నటించే ప్రకాశం పాట అందుకున్నాడు.

'బాబూ ధర్మం చెయ్యండి... తండ్రీ ధర్మం చెయ్యండి. ధర్మం చేస్తే పుణ్యమొస్తది. ఈ భిక్షకుడి కడుపు నిండుతది. ధర్మం చెయ్యండి'

అతడు 'రాగయుక్తంగా పాడుతుంటే ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. రోడ్డు మీద కనిపించే భిక్షకుడి పాత్రలో జీవించి స్టేజీ దిగాడు ప్రకాశం.

స్టేజీ దిగిన ప్రకాశంపై ప్రశంసల జల్లు.

'బాగా నటించడం కదా... జీవించావు. ఆంధ్రదేశంలో మరొక కొత్త అసమాన రంగస్థల నటుడి ఆవిర్భావం' ఇలా అతడిని పొగిడారు. 'ప్రథమ బహుమతి నీకే' అన్నారు చాలామంది. నిర్వాహకులు సైతం వచ్చి 'మీకు బహుమతి ఖాయం' అని భుజం తట్టి వెళ్ళారు. పోటీలు ముగిసిన అరగంట తర్వాత ఫలితాల ప్రకటన అని మైకులో చెప్పారు. ప్రకాశంలో టెన్షన్ మొదలయింది. చెప్పినట్లుగానే అరగంట తర్వాత గెలుపొందిన వారి పేర్లు పిలవడం మొదలైంది. పేర్లు పిలుస్తున్న కొద్దీ ప్రకాశంలో నిరాశ మొదలయింది. మొదటి బహుమతి రాలదు. రెండు, మూడు రాలేదు. ఆఖరికి కన్సొలేషన్ బహుమతీ రాలేదు. ప్రకాశంలో దుఃఖం. 'వారం రోజుల నించీ పోటీ కోసం కష్టపడుతున్నాను. బాగా జుట్టు పెంచాను. రెండు రోజులు భోజనం చెయ్యకుండా బిచ్చగాడి పాత్ర పోషణకు శ్రద్ధ తీసుకున్నాను. చేస్తున్న ప్రైవేటు ఉద్యోగానికి రెండు రోజులు సెలవు పెట్టాను. కంపెనీ వారు జీతం కట్ చేశారు. అయినా ఫలితం లేదు' - అలా అనుకుంటూ మెల్లగా ఆ ఆడిటోరియం నించి బైటకొచ్చాడు ప్రకాశం.

నడుస్తున్నాడు ప్రకాశం. నడుస్తూ ఆలోచిస్తున్నాడు. జరిగిన విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు. 'తను బాగా నటించానని పొగిడారు. బహుమతి రాలేదు. అయ్యో' అతడి మనసు బాధగా మూలిగింది

అప్పటికే బాగా చీకటి పడింది. ఆకాశంలో మిణుకుమిణుకుమంటున్న నక్షత్రాలు అతణ్ని జాలిగా చూస్తున్నట్టనిపించాయి. దూరంగా ఎవరింట్లోంచో పసిపిల్లవాడి ఏడుపు. నిద్రపట్టని కుక్కలు గోలగా అరుస్తున్నాయి.

ప్రకాశం ఓవర్‌బ్రిడ్జి దాటాడు. తన ఇంటి సందు తిరుగుతూ మున్సిపల్ పార్క్ వైపు చూసి ఆగిపోయాడు. ఆ పార్క్‌లో జనం పలచబడ్డారు. అతడు ఆగిపోడానికి కారణం తను మధ్యాహ్నం ఆ పార్కులో చూసిన కుర్రాడు మళ్ళీ కనిపించాడు. ప్రకాశం బుర్రలో ఏదో అనుమానం. గబగబా ఆ పార్కులోకి నడిచాడు. 'బాబూ!' అని పిలిచాడు. ఆ అబ్బాయి తల తిప్పాడు. వయసు పన్నెండేళ్ళుంటుందేమో.

'ఏమిటీ ఇంత రాత్రయినా ఇక్కడే ఉన్నావ్? మధ్యాహ్నమూ కనిపించావ్' అన్నాడు ప్రకాశం.

ఆ అబ్బాయి ప్రకాశం మాటలకు సమాధానం చెప్పకుండా తలొంచుకున్నాడు.

ప్రకాశం పరిశీలనగా ఆ అబ్బాయి వంక చూశాడు. తెల్లగా బొద్దుగా ఉన్నాడు. తల్లిదండ్రులు ముద్దుచేసే వయసు దాటింది.

ప్రకాశం మళ్ళీ ఆ కుర్రాడిని ప్రశ్నించాడు.

'ఇంట్లోంచి వచ్చేశాను. మమ్మీ డాడీ రోజూ తిడుతున్నారు' చెప్పాడు ఆ అబ్బాయి తలొంచుకునే.

'అలా అనకు బాబూ. అమ్మానాన్నలు తిట్టారంటే నీ మీద కోపం ఉండి కాదు. నీ మీద ఎంత బెంగ పెట్టుకుని ఉంటారో ఇల్లు వదిలి వచ్చేసినందుకు' అన్నాడు.

ఆ అబ్బాయి మాట్లాడకుండా తలొంచుకున్నాడు. ప్రకాశం

'వారం రోజుల నించీ పోటీ కోసం కష్టపడుతున్నాను. బాగా జుట్టు పెంచాను. రెండు రోజులు భోజనం చెయ్యకుండా బిచ్చగాడి పాత్ర పోషణకు శ్రద్ధ తీసుకున్నాను. చేస్తున్న ప్రైవేటు ఉద్యోగానికి రెండు రోజులు సెలవు పెట్టాను. కంపెనీ వారు జీతం కట్ చేశారు. అయినా ఫలితం లేదు'

ఆ కుర్రాడికి మళ్ళీ బోధించాడు. అయినా ఆ కుర్రాడు నోరు విప్పలేదు. 'సరే నిన్ను మీ ఇంట్లో దింపుతాను. ఇంకెప్పుడూ నిన్ను కొట్టొద్దని చెబుతాను' అన్నాడు చివరికి ప్రకాశంకు విసుగొచ్చి.

'వెళితే మళ్ళీ తిడతారు. కాదు కొడతారు కూడా. అందుకే వేరే ఊరికి వెళ్ళి ఏదో పని చేసుకుని బతుకుతాను' అన్నాడా కుర్రాడు.

తెలిసీ తెలియని వయసులోని ఆ కుర్రాడి మాటలకు ప్రకాశానికి జాలి కల్గింది. ఆలోచనల్లో పడ్డాడు. 'ఏం చెబితే ఆ కుర్రాడి మనసు మారుతుంది' అనుకున్నాడు. క్షణంలో ప్రకాశంలో ఒక ఆలోచన. వెంటనే 'బాబూ నేను ఎవరనుకుంటున్నావ్?' అన్నాడు.

ఆ కుర్రాడు ప్రకాశాన్ని పరిశీలనగా చూసి మీరు రోడ్ల మీద తిరిగి అడుక్కునే వాడిలా కనిపిస్తున్నారు' అన్నాడు కొంచెం వెనక్కి జరిగి.

'ఔను బాబూ... నీకూ లాగానే నేను పదేళ్ల వయసులో ఇంట్లోంచి పారిపోయి వచ్చాను. ఇదిగో ఇలా అడుక్కునే వాడిగా మారాను' అన్నాడు.

ఆ కుర్రాడి ముఖంలో భయం. అది గమనించి ప్రకాశం కొనసాగించాడు.

'పొట్ట నింపుకోడానికి రైల్వేస్టేషన్‌లో మూటలు మోశాను. హోటల్‌లో కప్పులు కడిగాను. చివరికి ఇలా తయారయ్యాను. నా వాలకం చూసి పిచ్చోడని కొడుతున్నారు. ఇదిగో దెబ్బలు' అంటూ ఆడిటోరియంలో కార్యకర్తలు కొట్టిన దెబ్బలు చూపించాడు ప్రకాశం.

అప్పటికే కుర్రాడి ముఖంలో ఆందోళన. ప్రకాశం మళ్ళీ కొనసాగించాడు. 'నన్ను మా అమ్మ ముద్దుగా చూసుకునేది. వెన్న కలిపిన పెరుగన్నం పెట్టేది. పరుపు వేసి నన్ను పడుకోబెట్టేది. కరెంటు లేకపోతే మా అమ్మ విసనకర్రతో విసిరేది. మరిప్పుడు వీధి బిచ్చగాడని. ఎవరూ ముద్ద వెయ్యకపోతే ఏ ఎంగిలాకుల కోసమో



పొట్ట నింపుకోడానికి రైల్వే స్టేషన్‌లో మూటలు మోశాను. హోటల్‌లో కప్పలు కడిగాను. చివరికి ఇలా తయారయ్యాను. నా వాలకం చూసి పిచ్చోడని కొడుతున్నారు. ఇదిగో దెబ్బలు

పెంటకుప్పలు వెతకాలి' అలా చెబుతూ ప్రకాశం ఏడ్చేశాడు. ఆ ఏడుపు చూసి ఆ కుర్రాడి కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

'అంకుల నేను మా ఇంటికి వెళ్లిపోతాను. మా డాడీకి ఫోన్ చెయ్యరా నేను ఈ పార్కులో ఉన్నట్టు' అంటూ ఆ కుర్రాడు తన తండ్రి విజిటింగ్ కార్డు ఇచ్చాడు. ప్రకాశం వెంటనే టెలిఫోన్ బూత్ వైపు పరిగెత్తాడు. ఆ కార్డులోని నెంబరుకు ఫోన్ చేసి 'మీ అబ్బాయి ఇక్కడి పిల్లల పార్కులో ఉన్నాడు' అంటూ ఆ పార్కు అడ్రస్ చెప్పాడు.

'థేంక్సండీ... మధ్యాహ్నం నించీ అబ్బాయి కనపడటం లేదని వాడి అమ్మ బెంగ పెట్టుకుంది. ఇంతీ మీరెవరు?' అన్నాడాయన. తనెవరో చెప్పడం ఇష్టం లేక ప్రకాశం ఫోన్ కట్ చేశాడు.

పావుగంట తర్వాత ఆ పార్కులోకి స్కూటర్లో ఇద్దరు దంపతులొచ్చారు. ఆ ఇద్దరినీ చూసి 'ఆ కుర్రాడి తల్లిదండ్రులు కాబోలు' అనుకున్నాడు ప్రకాశం. ఆ ఇద్దరూ ఆ కుర్రాడిని హత్తుకున్నారు. తన బిచ్చగాడి వేషంతో వారికి ఎదురుపడటం ఇష్టంలేక ఆ పార్కులోని చెట్టు చాటుకు తప్పుకున్నాడు ప్రకాశం.

ఆ పార్కులోని పలుచటి లైట్ల వెలుగులో కొడుకు దొరికిన ఆనందంతో వెలిగిపోతోన్న ఆ తల్లిదండ్రుల ముఖాలు చూశాడు ప్రకాశం. కొడుకుని తీసుకుని వారు స్కూటరెక్కారు. ఆ దృశ్యం ప్రకాశానికి ఎంతో మనోహరంగా కనిపించింది.

'ఆ కుర్రాడి తల్లిదండ్రుల కళ్లల్లో కనిపించిన వెలుగు పోటీ బహుమతి కన్నా విలువైనది' అనుకున్నాడు ప్రకాశం. చుట్టూ చీకటి తెరలు. అయినా ఆత్మానందపు వెలుగు దివిటీలు దారి చూపడంతో ఆనందంతో అడుగు ముందుకు వేశాడు ప్రకాశం. అతను ఒట్టి ప్రకాశం కాదు. స్వయం ప్రకాశం.

★

# సముద్ర గర్భంలో హోటల్

టెన్సింగ్ మొట్టమొదటిసారి ఎవరెస్ట్ శిఖరానికి చేరుకుని సంభ్రమంతో విజయపతాకం ఎగురవేసినప్పుడు వెనుకనుంచి చాయ్‌వాలా ఒకరు 'వేడివేడి టీ కావాలా సార్... ఆయాసమంతా తొలగిపోతుంది' అన్నాడట.

చంద్రుడిపైన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అడుగుపెట్టినప్పుడు అక్కడ అతనికి కనిపించింది ఉడిపి హోటల్!

చాలా ఏళ్ల క్రితం పేలిన జోక్‌లు ఇవి. కొండగుట్టలు, ఎడారులు.. చివరికి మంచు కురిసే పర్వతాలపైన కూడా హోటళ్లు కట్టిన సాహస వంతులూ ఉన్నారు. నీటిపై తేలే పడవలపై మూడునాలుగు అంతస్థుల స్టార్ హోటళ్లు ఇప్పుడు మామూలు విషయమై పోయాయి. అందుకే నీటిలోపల హోటల్ కడితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన పుట్టిన తక్షణం ఇజ్రాయెల్‌కు చెందిన 'రెడ్‌సీ స్టార్ గ్రూపు' ఆ ఆలోచనను కార్యరూపంలోకి తెచ్చింది. ఇలాత్ నగరం సమీపంలో సముద్రం అడుగున 'రెడ్ సీ స్టార్' ఏర్పాటు చేసిన హోటల్ ఇప్పుడు టూరిస్టులకు ప్రముఖ ఆకర్షణీయ కేంద్రమైంది.

సముద్రం అడుగున 15 అడుగుల లోతులో కట్టిన ఈ రెస్టారెంట్ గోడలన్నీ కూడా గాజుతో తయారయినవే. చుట్టూ రంగురంగుల, రకరకాల జలచరాలు తిరుగుతూ ఉంటాయి. పగటి పూట సూర్యుడి వెలుతురుతో వెలిగిపోతే రాత్రిపూట విద్యుత్ దీపాలకాంతులతో హోటల్ మెరిసిపోతుంది. హోటల్ లోపల ఇంటీరియర్



డెకరేషన్ అయితే కన్ను కుట్టేటట్లుగా ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఇజ్రాయెల్ డిజైనర్ అయాల్యా సర్ఫతి ఇంటీరియర్ డెకరేషన్ డిజైన్ చేసాడు. ఈ హోటల్‌లో సెమినార్లు జరుపుకోవచ్చు. తమ కొత్త ఉత్పత్తులను విడుదల చేయవచ్చు. పత్రికా సమావేశాలను, శిక్షణా తరగతులను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. గంటకు 300 డాలర్లు చెల్లిస్తే చాలు.

మొత్తం 90 సీట్లు ఉండే ఈ హోటల్‌లో దేశ విదేశీ వంటకాలు లభిస్తాయి. సముద్రంలో లభించే 'డెనిస్' అనే ఓ రకం చేప వంటకాలు ఈ హోటల్ ప్రత్యేకత. ఈ వంటకాల రుచి చూడడం కోసమే విదేశాలనుంచి కూడా కోటీశ్వరులు ఇక్కడికి వస్తూ ఉంటారు. అయితే హోటల్‌లోని గాజు గోడల పక్కన కూర్చుని నోరూరించే ఈ వంటకాలను చప్పరిస్తూ ఉంటే దగ్గర్లో ఉండే డెనిస్ బంధువర్గం ఉరిమి చూస్తే మాత్రం సిగ్గుపడకుండా ఉండాలి, అంతే!

-ఆర్కే

